సాక్షి సంగారెడ్డి

సోమవారం । 2 । జనవరి । 2023



భూ కేటాయింపుతోనే సరి! 8లో

పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం జిన్నారం మండల పరిధిలో స్థలాలు కేటాయించింది. ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో ఉపాధి కోసం యువత ఎదురు చూస్తోంది.



టైర్ల పరిశ్రమలను మూసివేయాలి

కొండాపూర్ మండలం మల్లేపల్లి శివారులోని టైర్ల పరిశ్రమలను మూసివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. 8లో



ఇటుక బట్టీలతో ఇబ్బందులు

జిన్నారం మండలంలో ఇటుక బట్టీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వెళ్తున్న వాహనదారులు దుమ్మూధూళితో సతమతమవుతున్నారు. 9లో

న్యూస్‌రీల్

పటాన్‌చెరులో డ్రంకెన్ డ్రైవ్.. 44 మందిపై కేసు



బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, ఎస్ఐ రాములు

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదయ్యాయి. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణం, మండలంలో మూడు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. పటాన్‌చెరు సీఐ వేణు గోపాల్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో, అలాగే మండల పరిధిలోని ముత్తంగి రింగ్ రోడ్డు, ఇస్నాపూర్ చౌరస్తాలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీల్లో పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, సీఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. మద్యం సేవించి పట్టుబడిన వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

సంగారెడ్డిలో 32 మందిపై..

సంగారెడ్డి టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 32 మందిపై కేసు నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ రాజు, ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసులు వీళ్లని అదుపులో తీసుకున్నట్టు తెలిపారు.

సిద్దిపేటలో 49 మందిపై..

సిద్దిపేటకమాన్: డిసెంబర్ 31 రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని రాజీవ్ రహదారిపై నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 49 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని వాహనాల తనిఖీ చేపట్టడం ద్వారా ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగలేదని పోలీస్ అధికారులు తెలిపారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు.

'ముక్కోటి'కి ముస్తాబు



నాచగిరి క్షేత్రం

వర్గల్(గజ్వేల్): జిల్లాలో సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్రం, వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలోని వెంకటేశ్వరాలయాలు ముక్కోటి ఏకాదశి వేడుకలకు ముస్తాబయ్యాయి. సోమవారం తెల్లవారు జామున 5.30 గంటలకు నాచగిరి లక్ష్మీనృసింహస్వామి, వర్గల్ వెంకటేశ్వరస్వామి వారు వైకుంఠ ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమిస్తారు. ముక్కోటి దేవతలు సేవించే వైకుంఠ ఏకాదశి రోజు ప్రాతఃకాలం ఉత్తర ద్వారంలో వేంచేసిన స్వామి వారిని దర్శించుకుంటే పాపాలు తొలగిపోయి సకల శుభాలు సిద్ధిస్తాయని చంద్రశేఖర సిద్ధాంతి పేర్కొన్నారు.

3న నెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఈనెల 3వతేదీన ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డానియెల్, ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఈనెల 7, 8 తేదీల్లో ఖమ్మం జిల్లాలో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషులు, మహిళల నెట్‌బాల్ పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈనెల 3న గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డుమార్గంలో గల బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో నెట్‌బాల్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు జిరాక్స్‌తో మంగళవారం ఉదయం 10 గంటలలోగా చేరుకోవాలని సూచించారు.

అలా.. వైకుంఠపురంలో



సంగారెడ్డి టౌన్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలోని వైకుంఠపురం, సాయిబాబా మందిరం, శివాలయాలు ఆదివారం భక్తులతో సందడిగా మారాయి. సంగారెడ్డి పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కేతకిలో సందడే సందడి



ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కేతకీ సంగమేశ్వర ఆలయం భక్తులతో సందడిగా మారింది. నూతన సంవత్సరం ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలోని అమృతగుండంలో పవిత్ర పుణ్య స్నానాలు ఆచరించి గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను క్యూలైన్ల ద్వారా వెళ్లి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

గణేశ్‌గడ్డ.. భక్తులకు అడ్డ



పటాన్‌చెరు టౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని రుద్రారం గణేశ్‌గడ్డ దేవాలయంతో పాటు పలు ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. గణేశ్‌గడ్డ దేవాలయానికి భక్తుల తాకిడీ ఎక్కువడంతో క్యూలైన్‌లో వెళ్లి స్వామి వారిని దర్శించుకునేలా ఆలయ ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌లు మల్లికార్జున్, ఈశ్వర్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం సాగుతుందన్నారు.

జిన్నింగ్.. నో రన్నింగ్

బోసిపోతున్న మిల్లులు
- ధరలేక తగ్గిన పత్తి కొనుగోళ్లు
- గతేడాదితో పోలిస్తే 25 శాతం కూడా జరగని క్రయవిక్రయాలు



గజ్వేల్‌లోని ఓ జిన్నింగ్ మిల్లు

గజ్వేల్: పత్తి కొనుగోళ్లలో సంక్షోభం నెలకొంది. 45 రోజుల క్రితం క్వింటాల్‌కు రూ.10వేల వరకు ధర పలకగా, ప్రస్తుతం రూ.7400కు పడిపోయింది. దీంతో రైతులు పత్తిని అమ్ముకోలేక ఇళ్ల వద్దనే నిల్వ ఉంచారు. ఫలితంగా పత్తి జిన్నింగ్ ప్రక్రియ ముందుకు సాగటం లేదు. తాజా పరిణామాల నేపథ్యంలో పత్తి మార్కెట్ ఊపందుకుంటుందా..? లేదా మరింతగా పడిపోనుందా..? అనేది వేచి చూడాల్సిందే.

- ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల ఎకరాలకుపైగా పత్తి సాగులోకి వచ్చింది. అతివృష్టి కారణంగా పంటకు అపారనష్టం వాటిల్లిన సంగతి విదితమే. ఈ లెక్కన ఉమ్మడి జిల్లా పరిధిలో తక్కువలోతక్కువగా 8లక్షల క్వింటాళ్లకుపైగా ఉత్పత్తులు వస్తాయని అంచనా. ప్రభుత్వం పత్తి నాణ్యమైన రకానికి రూ.6,380గా మద్దతు ప్రకటించిన విషయం తెలిసిందే. సీజన్ ఆరంభంలో బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధరను మించి కొనసాగగా.. ఒక దశలో క్వింటాల్‌కు రూ.10వేలకు చేరువై రైతులను మురిపించి తర్వాత రూ.3 వేలు తగ్గింది. దీంతో రైతులు పత్తిని ఇళ్ల వద్దనే నిల్వ చేసుకున్నారు. దీని కారణంగా క్రయవిక్రయాలు ఆగిపోయి పత్తి మార్కెట్ స్తంభించింది. ఈ క్రమంలోనే ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో పత్తి మార్కెట్‌లు బోసిపోయాయి.
- పత్తి ఉత్పత్తుల్లో ఇప్పటికే 70 శాతం మేరకు కొనుగోళ్లు జరగాల్సి ఉండగా.. గతేడాదితో పోలిస్తే 25 శాతానికి మించలేదు. సంగారెడ్డి జిల్లా పరిధిలో సదాశివపేట, రాయికోడ్, జోగిపేట, వట్‌పల్లి, నారాయణఖేడ్ ప్రాంతాల్లో ఇప్పటివరకు కేవలం 1.10లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి. సిద్దిపేట జిల్లా పరిధిలోని గజ్వేల్, సిద్దిపేట, చిన్నకోడూర్, తొగుట, కొండపాక, దౌల్తాబాద్, బెజ్జంకి, హుస్నాబాద్, చేర్యాల తదితర చోట్ల ఇప్పటివరకు కేవలం 1.40లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు మాత్రమే జరిగాయి.

గతేడాది భారీగా కొనుగోళ్లు

గతేడాది పత్తి కొనుగోళ్ల తీరును పరిశీలిస్తే ప్రస్తుతం జరుగుతున్న దానికి పొంతనే లేదు. గతేడాది డిసెంబర్ 30నాటికి సంగారెడ్డి జిల్లా పరిధిలో 5.14లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. సిద్దిపేట జిల్లాలో ఈ సమయానికి 4.90 లక్షల క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయి. ఒకరకంగా చెప్పాలంటే 70శాతం కొనుగోళ్లు అప్పటికే పూర్తయ్యాయి.

పడిపోయిన జిన్నింగ్

పత్తి కొనుగోళ్లు జరగక జిన్నింగ్‌లో సంక్షోభం నెలకొంది. గతేడాది ఈ సమయంలో నిత్యం ప్రతి జిన్నింగ్ మిల్లులో 800–1,500 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగితే జిన్నింగ్ కూడా వేగంగా జరిగింది. 700 క్వింటాళ్లపై పత్తి కొనుగోళ్లు జరిగితే మిల్లుల్లో జిన్నింగ్ రోజువారీగా జరిగేది. దీనివల్ల అప్పట్లో జిన్నింగ్ కార్యకలాపాలతో మిల్లులు కళకళలాడేవి. కానీ పరిస్థితులు భిన్నంగా మారాయి. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 45 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 26, సంగారెడ్డిలో 19 ఉన్నాయి. ఆయా మిల్లులన్నింటిలో ఇదేరకమైన పరిస్థితులు అలుముకున్నాయి. మిల్లుల్లో జిన్నింగ్ నిలిచిపోవడం వల్ల ఒక్కో మిల్లులో సరాసరిగా 50మందికి ప్రత్యక్షంగా, వందలాది మంది పరోక్షంగా ఉపాధి దెబ్బతిన్నది.

ముందు మురిపించి.. ఆ తర్వాత ఉసూరుమనిపించి

45 రోజుల క్రితం వరకు పత్తి క్వింటాల్‌కు రూ.9,350 పలికి మురిపించింది. నవంబర్ 16న గజ్వేల్ మార్కెట్ యార్డులో రాష్ట్రంలోనే అత్యధికంగా క్వింటాల్‌కు రూ.9,350 రికార్డు ధర పలికిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత క్రమంగా పడిపోతూ ప్రస్తుతం 7,400 మాత్రమే పలుకుతోంది. పత్తి ధర తగ్గడానికి గింజలు, క్యాండీ ధర పడిపోవడం కారణమనే విషయం స్పష్టమవుతోంది. పత్తి గింజలు క్వింటాలుకు రూ.3,850 పలికితే... నేడు రూ.3,500కు పడిపోయాయి. జిన్నింగ్ తర్వాత 356 కిలోల బరువు ఉండే క్యాండీ రెండ్రోజుల క్రితం వరకు రూ. 71,000 పలికితే నేడు అది రూ.65,000 పడిపోయిందని జిన్నింగ్ మిల్లుల యజమానులు చెబుతున్నారు.

పత్తి నిల్వ చేసుకోవడం వల్లే..

40 రోజుల క్రితం పత్తి క్వింటాల్‌కు రూ.9వేల పైచిలుకు పలికితే నేడు తగ్గింది. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోకుండా నిల్వ చేసి పెట్టుకోవడం వల్ల లావాదేవీలు నిలిచిపోయాయి. కొద్ది రోజుల తర్వాత కొనుగోళ్లు తిరిగి ఊపందుకునే అవకాశముంటుంది.

– రియాజ్, ఉమ్మడి మెదక్ జిల్లా మార్కెటింగ్ అధికారి

ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు

పత్తి కొనుగోళ్లలో ఇలాంటి సంక్షోభాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎప్పుడైనా వారం పదిరోజులు కొనుగోళ్లు తగ్గి తిరిగి ఊపందుకునేవి. కానీ నేడు పరిస్థితులు తలకిందులయ్యాయి. గతేడాదితో పోలిస్తే 25శాతం కూడా పత్తి కొనుగోళ్లు జరగలేదు. దీనివల్ల జిన్నింగ్ చేయలేకపోతున్నాం. మిల్లుల్లో లావాదేవీలు ఆగిపోతున్నాయి.

– బుక్క రమేశ్ (జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి)

స్పోర్ట్స్ హబ్‌గా పటాన్‌చెరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చి దిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన డే అండ్ నైట్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా నూతన సంవత్సరం సందర్భంగా యువకులు పెడదారి పెట్టకుండా క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు వెన్నంటి నిలుస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, మైత్రి క్లబ్ అధ్యక్షులు హనుమత్ రెడ్డి పాల్గొన్నారు.

10న మల్లన్న హుండీ లెక్కింపు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన హుండీ లెక్కింపు ఉంటుందని ఆలయ ఈఓ బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని బియ్యం, భక్తులు వేసిన కానుకలు లెక్కిస్తామన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్‌శాఖ, ఆలయ అధికారులు, శివశక్తి మండలి సభ్యులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

మల్లన్న క్షేత్రం.. భక్తజన సంద్రం



రాజగోపురం ఎదుట భక్తుల సందడి



మల్లన్న సన్నిధిలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



క్యూలైన్‌లో భక్తులు

దర్శనానికి సుమారు 4 గంటల సమయం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాతాల నుంచి తరలివచ్చిన భక్తులు నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని స్వామి వారిని వేడుకున్నారు. కొంతమంది ఒక్క పొద్దులతో మల్లికార్జున స్వామికి పసుపు బియ్యం, బోనాలు సమర్పించారు. గంగరేణి చెట్టుకు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన ఎల్లమ్మ తల్లికి బోనం చేసి బెల్లం, కల్లుసాక పెట్టి వేడుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో స్వామివారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టినట్టు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలజీ, ఏఈఓ అంజయ్య ఆలయ అధికారులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు.

కలెక్టర్ దంపతుల పూజలు

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆరుగురికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వహకుడు మనోహర్ తెలిపారు. అదే విధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించలేదని పేర్కొన్నారు.

నిధుల చెల్లింపులు.. ఇక ఆన్‌లైన్‌లోనే

- పారదర్శకతకు పీఎఫ్ఎంఎస్ విధానం
- నిధుల నిర్వహణపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన

పాఠశాలలు	సంఖ్య	విడుదలైన నిధులు
ప్రాథమిక, ప్రాథమికోన్నత	1019	2,68 ,85,000
ఉన్నత పాఠశాలలు	221	1,22, 35,000
మొత్తం	1272	3,91,20,0000



బిల్లుల చెల్లింపుపై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వం పాఠశాలల నిర్వహణకు ప్రతి విద్యా సంవత్సరం చెల్లించాల్సిన గ్రాంట్ విడుదల చేసింది. విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఈ నిధులు రావాల్సి ఉండగా, ఆరు నెలల తరువాత వంద శాతం నిధులను విడుదల చేసింది. ఈ నిధుల సద్వినియోగం, పారదర్శకతకు ప్రభుత్వం కొత్తగా పీఎఫ్ఎంఎస్ (పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం) అమలులోకి తీసుకొచ్చింది. దీంతో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడనుంది. విద్యాశాఖ జిల్లా ఆర్థిక గణాంక అధికారులు (ఎఫ్ఏఓ) ప్రధానోపాధ్యాయులకు సమావేశాలు నిర్వహించి వాటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

నమోదు చేస్తేనే బిల్లులు

పాత పద్ధతి ప్రకారం ఎస్ఎంసీ ఖాతా, క్లస్టర్ హెచ్ఎం ఖాతా, ఎంఈఓ ఖాతాలో జమ అయ్యేవి. వాటిని ఎస్ఎంసీ చైర్మన్, హెచ్ఎం కలిసి ఖర్చు చేసేవారు. అవసరమైన వారికి బిల్లులు ఇచ్చేవారు. ఇకపై నూతన విధానంలో ఇలా ఉండదు. విద్యాశాఖ వద్దనే నిధులు ఉంటాయి. పాఠశాల అవసరాలకు ఏదైనా వస్తువు కొనుగోలు చేసినా, అవసరానికి ఎవరికైనా డబ్బులు చెల్లించినా వారి పేరు, బ్యాంకు ఖాతా, సంబంధిత వస్తు సామగ్రి, సేవా బిల్లును ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి. ఆ తరువాత వారి ఖాతాకు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు జమ చేస్తారు. పాత పద్ధతిలో అయితే నేరుగా సంబంధితులకు బిల్లులు చెల్లించడంతో కొందరు తప్పుడు బిల్లులు సమర్పించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు లేకపోలేదు.

పాత బిల్లులపై సందిగ్ధం

నూతన పద్ధతి బాగున్నా ప్రభుతం నిధులు ఆలస్యంగా ఇవ్వడం, వినియోగానికి కొత్త పద్ధతి అమలుతో సందిగ్ధం నెలకొంది. పాఠశాల ఖాతాలో నిధుల్లేక పోయినా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు వివిధ అవసరాలకు ఇప్పటికే సొంతంగా వేలాదిగా ఖర్చు చేశారు. వాటికి సైతం నూతనంగా తీసుకొచ్చిన పీఎఫ్ఎంఎస్ విధానంలోనే చెల్లింపులు చేయాలనే నిబంధన విధించారు. దీంతో సొంతంగా ఖర్చు చేసిన నిధులను ఎలా రాబట్టుకోవాలని, కొత్త పద్ధతిలో వారికి చెల్లించి తాము వారి వద్ద నుంచి ఎలా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకే



విద్యాశాఖకు సంబంధించి అన్ని రకాల నిధుల ఖర్చును ఇక నూతన పద్ధతిలోనే చేయాలి. అక్రమాలకు తావులేకుండా, పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఈ విషయంపై ఇదివరకే జిల్లాలో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాం. ఇక వ్యయానికి సంబంధించిన బిల్లులు, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. గతంలో ఖర్చు చేసి ఉంటే వాటికి సంబంధించిన బిల్లులు సమర్పిస్తే వచ్చే అవకాశం ఉంటుంది.

– నాంపల్లి రాజేశ్, డీఈఓ

క్లుప్తంగా

'నారోజు'కు జాతీయ పురస్కారం



ఎంపీ లక్ష్మణ్ చేతుల మీదుగా జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న వెంకట రమణ

బెజ్జంకి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, మీనాక్షి ఫౌండేషన్ సంయుక్తంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ పురస్కార ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన తెలుగు సహాయ ఆచార్యులు నారోజు వెంకటరమణకు కళారంగంలోని గాయిని విభాగంలో జాతీయ పురస్కారాన్ని పార్లమెంట్ సభ్యుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు రమణాచార్యులు చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకులు, నిర్మాతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



నజర్ (ఫైల్)

దుబ్బాక ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైయ్యాడు. ఈ ఘటన రాయపోల్ మండలం వడ్డేపల్లిలో జరిగింది. రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్డేపల్లి గ్రామానికి చెందిన షేక్ నజర్ (33) వృత్తిరీత్యా డ్రైవర్. శుక్రవారం రాత్రి బయటకు వెళ్లి వస్తానని భార్యకు చెప్పి సెల్‌ఫోన్ ఇంటిలో ఉంచి వెళ్లాడు. నజర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, మిత్రులు, తెలిసిన ప్రదేశాల్లో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు నజర్ కనబడటంలేదంటూ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నజర్ ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

పొగతో ఊపిరాడక కూలీ మృతి

ఝరాసంగం(జహీరాబాద్): పొగతో ఊపిరి ఆడక ఓ కూలీ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్ మండలం పరిధిలోని అల్గోల్ గ్రామానికి చెందిన చాకలి యాదుల్(50), బేతాల్ ఆదివారం ఝరాసంగం మండల పరిధి మాచ్‌నూర్ గ్రామ శివారులో కుమ్మరి వెంకటేశం పొలంలో కూలి పనులు చేసేందుకు వచ్చారు. పనుల్లో భాగంగా చెరుకు పొలంలో వాడే తగలబెట్టుతుండగా పొగలు రావడంతో ఊపిరాడక చాకలి యాదుల్ మృతి చెందాడు. అదేవిధంగా మరో కూలి అస్వస్థకు గురికావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి వివరించారు.



చాకలి యాదుల్ మృతదేహం

భూ కేటాయింపుతోనే సరి!

జాడలేని పరిశ్రమలు

- ఉపాధి కోసం యువత ఎదురుచూపు

జిన్నారం(పటాన్‌చెరు): ఔటర్ రింగు రోడ్డుకు బయట పరిశ్రమలు ఏర్పాటు చేసే లక్ష్యంతో ప్రభుత్వం జిన్నారం మండల పరిధిలో స్థలాలు కేటాయించింది. ఏళ్లు గడుస్తున్నా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఉపాధి లభిస్తుందని ఎదురుచూసిన యువతకు చివరికి నిరాశే మిగిలింది.

- జిన్నారం మండలంలోని ఖాజీపల్లి, గడ్డపోతారం, బొల్లారం ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాయి.
- ఈ ప్రాంతాల్లో సుమారు 500 వరకు భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయి.
- వీటిలో 90శాతం రసాయన పరిశ్రమలు ఉండగా వాయు, జల కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- తాజాగా జిన్నారం మండలంలోని ఆయా గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు భూములు గుర్తించి టీఎస్ఐఐసీకి అప్పజెప్పారు.
- స్థలాలు కేటాయించినా, ఇప్పటివరకు ఎలాంటి నిర్మాణ పనులు ప్రారంభించలేదు.

గుర్తించిన గ్రామాలు ఇవే..

- జిన్నారం మండలంలోని మంగంపేటలో 18 ఎకరాల్లో హెలికాప్టర్ విడిభాగాల పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు అధికారులు స్థలం కేటాయించారు.
- జిన్నారంలోని సర్వేనంబర్ ఒకటిలో 36 ఎకరాల స్థలాన్ని పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు హెచ్ఎండీఏకు కేటాయించారు.
- దీనిపై రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగు చేసుకుంటున్న భూములు పరిశ్రమలకు కేటాయించడంపై ఆందోళన చేపట్టారు. హైకోర్టు నుంచి స్టే కూడా తెచ్చుకున్నారు.
- గడ్డపోతారంలో 14 ఎకరాలు అల్లీనగర్‌లో 20 ఎకరాలను అధికారులు పరిశ్రమలకు కేటాయించారు.
- శివనగర్‌లో 140 ఎకరాల స్థలాన్ని టీఎస్ఐఐసీకి అప్పజెప్పారు. ఎల్ఈడీ బల్బుల పరిశ్రమ కోసం పనులు ప్రారంభించాల్సి ఉండగా, అడుగు కూడా ముందుకు పడలేదు.
- వావిలాలలో 190 సర్వే నంబర్‌లోని స్థలాన్ని గతంలో దిల్ అనే సంస్థకు కేటాయించారు. ఆ స్థలాన్ని రద్దు చేసి 60 ఎకరాలు రెవెన్యూ అధికారులు టీఎస్ఐఐసీకి అప్పజెప్పారు. అయితే ఇక్కడ ఏర్పాటుచేయబోయే పరిశ్రమల వివరాలను మాత్రం ఎవరికీ చెప్పడం లేదు.
- కాలుష్య రహిత యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లో సుమారు రెండు వందల వరకు పరిశ్రమలు రానున్నాయి.
- జీడిమెట్ల, బాలానగర్ ప్రాంతాల్లోని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఔటర్ రింగురోడ్డుకు బయట జిన్నారం పరిధిలో ఏర్పాటు చేయించేలా అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.



మంగంపేటలో పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కరువు

- ప్రస్తుతం ఉన్న పరిశ్రమలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లేవు. దీంతో ఇక్కడి యువత ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటున్నారు.
- తాజాగా కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని తెలియడంతో యువకులు తమకు ఉపాధి లభిస్తుందనే ఆశతో ఉన్నారు.
- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఇవ్వాలని ఇక్కడి నాయకులు, అధికారులు పరిశ్రమల యాజమాన్యాలకు సూచిస్తున్నారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి



పరిశ్రమల ఏర్పాటుకు తాము సహకరిస్తున్నాం. స్థలాలు కేటాయించినా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడం సరి కాదు. ప్రభుత్వం చర్యలు తీసుకొని కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.

– రవీందర్‌గౌడ్, ఎంపీపీ, జిన్నారం

ఉపాధి కల్పించండి



మంగంపేటలో హెలికాప్టర్ విడిభాగాల తయారీ కోసం స్థలం కేటాయిస్తున్నామని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి పనులు మొదలు పెట్టలేదు. పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్, యువజన నాయకుడు, మంగంపేట

టైర్ల పరిశ్రమలను వెంటనే మూసివేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని మల్లేపల్లి శివారులోగల టైర్ల పరిశ్రమలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడారు. మండలంలోని మల్లేపల్లి గ్రామపంచాయతీలోగల 11 టైర్ల పరిశ్రమల కారణంగా ఎదురుగుడెం, గుంతపల్లి, చర్ల గోపులారం పొలాలు కాలుష్యం బారినపడి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కాలుష్యం కారణంగా భూగర్భ జలాలు కలుషితమై గ్రామస్తులు శ్వాసకోసం సంబంధ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. పంటలు దెబ్బతినడంతో దిగుబడులు సరిగా రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, వెంటనే టైర్ల పరిశ్రమల మూసివేతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు వెంకటేశం, సుదర్శన్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటకమాన్: మంత్రి హరీశ్‌రావు వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్న వారిపై, వాటిని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్న వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రంగధాంపల్లి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు ఆదివారం సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నేతలు మాట్లాడుతూ గతంలో సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో జరిగిన బీఆర్ అంబేడ్కర్ సభలో బైరి నరేశ్ గ్రామగ్రామాన అంబేడ్కర్ విగ్రహాలు పెట్టాలంటూ చేసిన వ్యాఖ్యలను అదే స్టేజ్ మీద ఉన్న మంత్రి హరీశ్‌రావు సమర్థించారన్నారు. అయితే ఇటీవల అయ్యప్పస్వామి జననంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సదరు వ్యక్తిని మంత్రి మెచ్చుకుంటున్నట్లుగా ఎడిట్ చేసిన వార్తను ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేటట్లుగా కొందరు అసత్య ప్రచారాలను చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుత వివాదానికి, అప్పటి మాటలకు ఏ సంబంధం లేకపోయినా ప్రజలను తప్పుదోవ పట్టించేలా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు తుపాకుల మురళీ, రాము, రజనీకాంత్, భాస్కర్, మహిపాల్‌గౌడ్, కమల్, సంతోష్, చందు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

శిథిలావస్థలో గోసాన్‌పల్లి వాగుబ్రిడ్జి



పగుళ్లిచ్చిన వాగు బ్రిడ్జి

దుబ్బాకరూరల్: మండలంలోని గోసాన్‌పల్లి వాగు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. దానిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు జంకుతున్నారు. బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. జరిగిన ప్రమాదాల్లో కొందరు మరణించారు. ఈ బ్రిడ్జి మీదుగా రాజన్నసిరిసిల్లా జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి చేరుకోవచ్చు. వర్షాలు కురిస్తే చెరువు నుంచి వచ్చే నీరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తాయి. దీంతో రాకపోకలు నిలిచి పోతాయి. బ్రిడ్జికి సైడ్ వాల్స్ లేకపోవడంతో అందులో జారిపడే ప్రమాదం ఉంది.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

బ్రిడ్జి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై నుంచి వెళ్లాలంటే భయమేస్తుంది. వర్షా కాలంలో చెరువు నీరంతా బ్రిడ్జిపై నుంచి వెళ్తుంది. దీంతో రాకపోకలు బంద్ చేస్తాం. ఇది వరకు వాహనాలు ఢీకొని కొందరు మరణించిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

– తిరుపతిరెడ్డి, గ్రామస్తుడు

బావిలోపడి వ్యక్తి మృతి

సిద్దిపేటకమాన్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట టౌటూన్ పరిధిలోని కేసీఆర్ నగర్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. సిద్దిపేట టూ టౌన్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ గ్రామానికి చెందిన బషీర్‌కు గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో సిద్దిపేటలో వైద్యం చేయించుకునే నిమిత్తం శనివారం సాయంత్రం కేసీఆర్‌నగర్‌లోని తమ బంధువుల ఇంటికి వచ్చాడు. హాస్పిటల్‌కు వెళ్లే సమయంలో బషీర్ పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తూ భార్యాపిల్లలను వదిలిపెట్టి పారిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా కనిపించలేదు. ఆదివారం ఉదయం కేసీఆర్‌నగర్ శివారులోని ఓ బావిలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు బావిలో చూడగా బషీర్‌గా గుర్తించారు. బషీర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, మొబైల్ ఫోన్లు

నర్సాపూర్: పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ షేక్‌లాల్‌మదార్ తెలిపారు. ఆదివారం విలేకరులకు వివరాలు తెలిపారు. పోలీసులకు నత్నాయిపల్లి శివారులోని అటవీ ప్రాంతానికి కొంతమంది వారాంతంలో వచ్చి పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. పక్కా సమాచారం మేరకు శనివారం అర్ధరాత్రి పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,14,130 నగదు, 12 సెల్‌ఫోన్లు, చార్జింగ్ లైటు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారంతా బాలానగర్, షాపూర్‌నగర్ తదితర ప్రాంతాలకు చెందిన వారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామ శివారు పత్తికొండలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని ఐఎంఎల్ డిపో వెనుక పత్తి కుంటలో మృతదేహం తేలి ఉందన్న పశువుల కాపరుల ద్వారా పోలీసులకు సమాచారం తెలిసింది. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితమే కుంటలో పడి చనిపోయి ఉండవచ్చని, మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉంటుందన్నారు. సర్పంచ్ ఇందిరా ప్రియదర్శిని ఫిర్యాదు మేరకు తెలియని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురిలో భద్రపరచినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులు కొల్చారం పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మనస్తాపంతో ఒకరు.. మద్యానికి బానిసై మరొకరు..

వ్యక్తిగత సమస్యలతో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. టెంట్ హౌస్ పనులు చేసే యువకుడు ఇంటిలో ఉరివేసుకున్నాడు. అలాగే మద్యానికి బానిసైన మరో యువకుడు భార్యతో గొడవపడి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.



అరుణ్ (ఫైల్)

దుబ్బాక: మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన దుబ్బాక మున్సిపల్ పరిధి దుంపలపల్లిలో జరిగింది. ఆదివారం దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుంపలపల్లికి చెందిన ముదురుకోళ్ల స్వరూప కూలీ పనులు చేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. పెద్ద కుమారుడు అరుణ్(24) దుంపలపల్లిలో టెంట్ హౌస్, డెకరేషన్ పనులు చేస్తున్నాడు. మూడు రోజులుగా అరుణ్ అందోళనగా ఉన్నాడు. శనివారం రాత్రి దుంపలపల్లిలోని తన పాత ఇల్లు రేకులషెడ్డుకు ఉరివేసుకున్నాడు. కుమారుడు ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో అతడి కోసం వెతకగా పాత ఇంటిలో ఉరివేసుకుని కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టర్ నిమిత్తం మృతుదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ వంద పడకల ఆస్పత్రికి తరలించారు. తన కుమారుడు తరుచూ నాలుగు ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి మాట్లాడుతుండేవాడని, తన కుమారుడి చావుకు వారికి సంబంధం ఉందని ఆరోపిస్తూ మృతుడి తల్లి స్వరూప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సుధాకర్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నెంటూరుకు చెందిన లింగ సుధాకర్‌కు రెండేళ్ల క్రితం షామీర్‌పేట మండలం తుర్కపల్లికి చెందిన భవానితో వివాహం జరిగింది. వారికి శ్రీనిత్య అనే కూతురు ఉన్నది. పెళ్లి చేసుకున్న తర్వాత సుధాకర్ మద్యానికి బానిసయ్యాడు. ఏ పనిచేయకుండా తరచూ భార్యతో గొడవపడేవాడు. రెండు నెలల క్రితం శామీర్‌పేటలో ఇంటర్నెట్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి వర్గల్ శివారులోని కల్వర్టు వద్ద తాను పురుగుల మందు తాగినట్లు వీడియోకాల్ ద్వారా సుధాకర్ తన సోదరికి తెలిపాడు. వెంటనే ఆమె తండ్రి శ్రీనుకు సమాచారమిచ్చింది. ఆయన ఘటనాస్థలికి చేరుకుని సుధాకర్‌ను లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు.

'మంకీ ఫుడ్ కోర్టు'

- కోతుల కోసం పద్మనాభునిపల్లిలో పండ్ల తోటల సాగు
- గ్రామశివారులో మూడు ఎకరాలు కేటాయింపు
- మూడేళ్లుగా పండ్ల తోటలను సంరక్షిస్తున్న గ్రామ పంచాయతీ

దుబ్బాకరూరల్: కోతుల బెడదతతో ప్రజలు నానా అవస్థలుపడుతున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు గుంపులు గుంపులుగా గ్రామాలకు చేరాయి. అక్కడ వాటికి సరిపడా ఆహారం లేకపోవడంతో గ్రామాలు, పట్టణాలకు వస్తున్నాయి. ఏకంగా ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్లుతున్నాయి. ఇండ్ల పైకప్పులను ధ్వంసం చేస్తున్నాయి. రైతులు పండించి కూరగాయలను, ఇతర ఆహార పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రస్థాయిలో నష్ట పోతున్నారు. కోతుల బెడద నుంచి పంటలను రక్షించుకోవడానికి వాయిస్ అలారం ఏర్పాటు చేశారు. కొంత మంది రైతులు డప్పు చప్పుడు, టపాసులు కాల్చుతున్నారు. కోతులను బెదర కొట్టేందుకు కొన్ని గ్రామాల రైతులు ఇతర జిల్లాల నుంచి రూ.30 వేలు ఖర్చు పెట్టి కొండెంగలను కొనుగోలు చేసి తిప్పుతున్నారు. వాటి సంరక్షులకు ప్రతీ నెల జీతం ఇస్తున్నారు. కోతుల బెడదను తప్పించడానికి అవి ఊర్లలోకి రాకుండా, పంట పొలాలను నష్టం చేయకుండా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలోని గ్రామ శివారులో ప్రత్యేకించి 'మంకీ ఫుడ్‌కోర్టు' ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మూడు ఎకరాలను చదును చేసి అందులో పలు రకాల పండ్ల మొక్కలు నాటారు. అవి నాటి మూడు సంవత్సరాలైంది. మామిడి, జామ, దానిమ్మ, సపోట, సీతాఫలం, రేగుపండ్లు, బొప్పాయి, సంత్ర, అరటి, బత్తాయి, అల్లనేరేడు, వెలగ పండ్లు, ఖర్బూజ, దోస పండ్ల మొక్కలను పెంచుతున్నారు.



గ్రామ పంచాయతీ పెంచుతున్న పండ్ల మొక్కలు



గుంపులు గుంపులుగా తిరుగుతున్న కోతులు



రాజక్కపేటలో కొండెంగలను తిప్పుతున్న గ్రామస్తులు



పద్మనాభునిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

అన్ని రకాల పండ్ల మొక్కలు పెంచుతున్నాం



కోతుల బెడద నుంచి తప్పించుకోవడానికి వాటికి ఆహారంగా పలు రకాల పండ్ల తోటలు పెంచుతున్నాం. దానికి మంకీఫుడ్ కోర్టుగా పేరు పెట్టాం. ప్రతీ సీజనల్‌లో లభించే పండ్ల మొక్కలు నాటాం. అవి నాటి మూడేళ్ల అయ్యింది. మూడెకరాల్లో పండ్ల తోటలను సాగు చేస్తున్నాం. ఫుడ్ కోర్టులో కోతులకు పలు రకాల పండ్లు ఆహారంగా లభిస్తాయి.

– రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ

మూడెకరాల్లో సాగు చేస్తున్నాం



గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ శివారులో మూడెకరాలు ఎంచుకుని అందులో పలు రకాల పండ్ల మొక్కలు సాగు చేస్తున్నాం. కోతులు, ఇండ్లలోకి, పంట పొలాలను నాశనం చేయకుండా వాటికి ఆహారంగానే మంకీఫుడ్ కోర్టును ఏర్పాటు చేశాం. మొక్కలకు నీళ్లు పోసేందుకు ఓ వ్యక్తిని ఏర్పాటు చేశాం. ఫుడ్ కోర్టుతో కొంత మేరకు కోతుల బెడద తప్పుతుంది.

– పర్శురాములు, గ్రామ సర్పంచ్